క్లుప్తంగా

ఉప్పు ద్రావణం చల్లాలి..



పొలంలో వరి కుప్పలను పరిశీలిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: వర్షాలకు తడిచిన వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లితే ధాన్యం మొలకెత్తవని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి, పొలాల్లో ఉన్న వరి దిబ్బలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ప్రతి లీటర్ నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పును కలిపి ఎకరా వరి పనలకు 25 కిలోల ఉప్పును సరిపడా నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే పనలను గట్లపైకి తీసుకువచ్చి ద్రావణం పిచికారీ చేయాలన్నారు.

పంట నేలకొరిగినా ఇబ్బంది లేదు..



ఒరిగిన వరి పంట

భోగాపురం: ఫెంగల్ తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో కురిసిన వర్షాలకు సుమారు 1.8 హెక్టార్లలో వరి పంట నేలకొరిగిందని, అయినప్పటికీ ఎటువంటి ఇబ్బంది లేదని ఏఓ వి. హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలో నేలకొరిగిన వరి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సంవత్సరం మండల వ్యాప్తంగా సుమారు 596 హెక్టార్లలో రైతులు వరిపంట సాగు చేశారన్నారు. వాటిలో దాదాపు 112 హెక్టార్ల వరకు కోతకు వచ్చిందని చెప్పారు. అయితే ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు పనలపై ఉప్పుద్రావణం పిచికారీ చేయాలని సూచించారు.

ఆత్మీయ వీడ్కోలు..



ట్రాఫిక్ ఎస్సై రాజు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, తదితరులు

విజయనగరం క్రైమ్: సుదీర్ఘకాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఎస్సై, హెచ్‌సిలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆత్మీయవీడ్కోలు నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగ విరమణ చేసిన వారిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ట్రాఫిక్ ఎస్సై అల్లూరి మహేశ్వరరాజు దంపతులు, రూరల్ హెచ్‌సీ వి.కృష్ణంనాయుడులను ఎస్పీ అభినందించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యంపై అవగాహన తప్పనిసరి

- ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సరిత



మాట్లాడుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ బీబీసరిత

విజయనగరం అర్బన్: పర్యావరణానికి చేటు చేసే కాలుష్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సరిత అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'జాతీయ కాలుష్య నియంత్రణ' దినోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజగజ...



- చలికి వణుకుతున్న జనం...
- తుఫాన్ కారణంగా మరింత పెరిగిన చలి తీవ్రత
- చలిలో తిరగకూడదంటున్న వైద్య నిపుణులు
- చర్మ, గొంతు సంబంధిత వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ
- నిమోనియా, సీఓపీడీ వ్యాధులు కూడా వ్యాప్తి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



చెవి ఇన్‌ఫెక్షన్‌తో వచ్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: అసలే శీతాకాలం.. ఆపై తుఫాన్ ధాటికి వర్షాలు కురుస్తుండడంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. దీంతో ప్రజలు వణుకుతున్నారు. చల్లటి గాలులు వీయడంతో ప్రజలు తట్టుకోలేక అల్లాడుతున్నారు. చలిలో తిరగకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. చలిలో తిరిగితే పలు వ్యాధులు సోకే అవకాశం ఉంది. కాబట్టి తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. చలి తీవ్రత వల్ల చిన్నారులు, వృద్ధులు, ఉద్యోగస్తులు, పనులకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో నిమోనియాతో పాటు చర్మ, గొంతు సంబంధిత వ్యాధులు, సీఓపీడీ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఏమాత్రం అలసత్వంగా ఉన్నా వ్యాధుల బారిన పడక తప్పదని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి. చలిలో ఎక్కువగా తిరగడం, రక్షణ దుస్తులు ధరించకుండా ప్రయాణం చేసినా ఇబ్బందులు తప్పవు.

చర్మ వ్యాధులు..

చలికాలంలో చర్మ సంబంధిత సమస్యలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. చర్మం పొడి బారిపోవడం, అరికాళ్లు, పాదాలు పగిలిపోవడం, పగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సమస్యలు ఏర్పడతాయి. చర్మం పొడి బారిపోవడం వల్ల దురదలు వస్తాయి. దురదకోసం గోకితే ఎగ్జిమా (చర్మ సంబంధిత ఇన్‌ఫెక్షన్) వస్తుంది. సోరియాసిస్, ఇతియోసిస్ వంటి వ్యాధులు ఉధృతమయ్యే అవకాశం ఉంది. చలికి సోరియాసిస్ వ్యాధి సోకినవాళ్లకు చేప పొట్టులా చర్మం రాలిపోతుంది. ఇతియోసిస్ వ్యాధి సోకిన వాళ్లకు చర్మం చేప పొలుసులా పొలుసు బారిపోతుంది.

చలిలో తిరగకూడదు..

ఈ సీజన్‌లో ఉదయం ఐదు నుంచి ఆరు గంటలు.. సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆరుబయట తిరగకూడదని వైద్యులు సూచిస్తున్నారు. కొబ్బరి నూనె, వ్యాజిలైన్ వంటివి చర్మం పొడి బారకుండా రాసుకోవాలి. స్నానం చేసే ముందు కొబ్బరి నూనెతో మర్దన చేసుకుంటే మంచిది.

ఊలు వస్త్రాలు ధరించడం మంచిది..

చలికాలంలో ఊలుతో తయారు చేసిన వస్త్రాలు ధరిస్తే రక్షణగా ఉంటుంది. గ్లిజరిన్, అలోవెరా సబ్బులు వాడడం మంచిది. బైక్‌పై వెళ్లేటప్పుడు గ్లౌజులు, మంకీక్యాప్, మఫ్లయర్ వంటివి ధరించాలి. చలి ఎక్కువగా ఉంటే చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి సైనసైటీస్, అలర్జీలు, టాన్సిల్స్ వంటి వచ్చే అవకాశం ఉంది.

జీర్ణమయ్యే ఆహారం మంచిది..



చలి కాలంలో ఆకలి తక్కువగా ఉంటుంది కాబట్టి తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలి. పండ్లు ప్రతిరోజూ తీసుకోవాలి. టీ, కాఫీలకు బదులు మజ్జిగ, కొబ్బరినీళ్లు తీసుకోవాలి. ఒంట్లో ఏమాత్రం నలతగా ఉన్న సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.

– బర్ల అజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

మరోసారి అవార్డు సాధించాలి..



ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో మరోసారి అవార్డు పొందేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో బ్యాంకర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి కృషి ఫలితంగా ఇటీవల ప్రధానమంత్రి స్వనిధి అవార్డు సాధించామన్నారు. మరోసారి కూడా అవార్డు సాధించేందుకు కృషి చేయాలన్నారు. రుణ మంజూరుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. – విజయనగరం

తొలగింపు ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ టీవీ రమణ



ధర్నా చేస్తున్న బాధితురాలు, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం ఫోర్ట్: గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో రామన్నపేటలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న మానాపురం సౌజన్య తొలగింపు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ టీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 అక్టోబర్ 10న సౌజన్య హెల్పర్‌గా విధుల్లో చేరిందన్నారు. అప్పుడే అన్నిరకాల పత్రాలు, సర్టిఫికెట్లు అధికారులకు చూపించిందని చెప్పారు. అయితే ఇటీవల సర్టిఫికెట్స్ సక్రమంగా లేవని చెబుతూ ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. ఇప్పుడున్న పీడీ, సీడీపీఓలే అప్పుడు కూడా ఉన్నారని.. అప్పుడు సక్రమందగా ఉన్న సర్టిఫికెట్స్.. ఇప్పుడు అక్రమం ఎలా అవుతాయని ప్రశ్నించారు. కేవలం రాజకీయ వేధింపులతోనే సౌజన్యను తొలిగించారన్నారు. ఈ మేరకు పీడీ, సీడీపీఓలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె. సురేష్, ఎ. జగన్‌మోహన్, పి. జ్యోతి, రామన్నపేట గ్రామస్తులు పి.సత్యం, పి. లక్ష్మన్నాయుడు, టి. సన్యాసిరావు, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌నంటూ మోసం..



ఎంపీడీఓ రాధికకు ఫిర్యాదు చేస్తున్న కుమిలి సర్పంచ్ అప్పయ్యమ్మ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ దల్లి ముత్యాలురెడ్డి తాను సర్పంచ్‌నంటూ అందరినీ మోసం చేస్తున్నాడని ప్రస్తుత సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ ఎంపీడీఓ ఎం. రాధికకు సోమవారం ఫిర్యాదు చేశారు. తాను దళిత మహిళ కావడంతో ఉద్దేశపూర్వకంగానే ముత్యాలురెడ్డి సర్పంచ్‌గా చలామణి అవుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. లెటర్‌ప్యాడ్‌లు కూడా సర్పంచ్‌గానే ముద్రించారని ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎంపీడీఓ రాధిక స్పందిస్తూ, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓను కలిసిన వారిలో పూసపాటిరేగ సర్పంచ్ టొంపల సీతారామ్, ప్రజాప్రతినిధులు గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులున్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

భోగాపురం: పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి చట్టపరమైన హక్కులు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ పారిశుధ్య, స్వచ్ఛభారత్ స్కీమ్ వర్కర్స్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. ప్రతినెలా ఐదో తేదీలోగా జీతాలు చెల్లించడంతో పాటు కార్మికులను ప్రభుత్వం అధీనంలోనే ఉంచాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు దహన ఖర్చులకు రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు డి. హరిరాములు, బి. రాంబాబు, బి. పైడిరాజు, వి. అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ హాల్ ఏర్పాటు చేయాలి..

విజయనగరం పూల్‌బాగ్: విజయనగర పట్టణంలో ఉన్న రీడింగ్ హాల్స్ ఫీజులు తగ్గించడంతో పాటు నిరుద్యోగులకు ప్రత్యేకంగా స్టడీ హాల్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ కన్వీనర్ సీహెచ్. హరీష్ డిమాండ్ చేశారు. రీడింగ్ రూమ్ ఫీజులు తగ్గించి ప్రభుత్వమే స్టడీ హాల్ ఏర్పాటు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ, రీడింగ్ రూముల్లో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరిట అదనపు బాదుడు తగదన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికి వదిలేసి, ప్రజలకు విద్యుత్‌భారం వేసిందని ఆరోపించారు.

వన్‌స్టాప్ సెంటర్‌తో రక్షణ

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలు రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చునని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్స్ తాన్నే అనిత, రొంగలి వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక సాయి గాయత్రి కళాశాలలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు నిరోధానికి చైల్డ్‌లైన్ 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ముగిసిన సోషల్ వీక్ మహోత్సవాలు

విజయనగరం అర్బన్: రింగ్‌రోడ్డు వద్ద గల శ్రీచైతన్య పాఠశాలలో వారం రోజులుగా నిర్వహించిన సోషల్ వీక్ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది సంగీత కాళహస్తి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ శ్రీధర్‌బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టోల్ భారం తగ్గించండి..



కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహన డ్రైవర్లు, యజమానులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ అధికారుల విధులకు వినియోగిస్తున్న అద్దె వాహనాలకు టోల్‌ప్లాజా వసూలు భారాన్ని తగ్గించాలని ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల డ్రైవర్ల సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ అంబేడ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, టోల్‌ప్లాజా మినహాయింపుతో పాటు ప్రతినెలా అద్దె డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 250 వాహనాల వరకు ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగంలో ఉన్నాయని.. మూడు నుంచి నాలుగు నెలల వరకు అద్దె ఇవ్వకపోవడంతో వాహనాలు నడపలేకపోతున్నామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు చంద్రమోహన్, ఎస్.రమణ, తదితరులున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

- రెండోరోజు కొనసాగిన పైప్‌లైన్ మరమ్మతులు



ట్యాంకర్ నుంచి నీరు పట్టుకుంటున్న ప్రజలు

విజయనగరం: నగరంలోని ఊటగెడ్డ ప్రాంతంలో ప్రధాన పైప్‌లైన్ పాడవ్వడంతో కొన్ని ప్రాంతాలలో తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. రెండో రోజు సోమవారం కూడా నీటి సరఫరా చేపట్టారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

కొనసాగుతున్న మరమ్మతులు..

నెల్లిమర్ల వాటర్ వర్క్స్ నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ ఊటగెడ్డ వద్ద పాడవ్వడంతో మరమ్మతులు చురుగ్గా చేపడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మరమ్మతులు చేపడుతుండగా..మంగళవారానికి పూర్తయ్యే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీరు కావాల్సిన వారు 95502 99664 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జాతీయస్థాయి పోటీల్లో హెచ్‌సీ సత్తా..



హెచ్‌సీ కృష్ణంనాయుడును అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, తదితరులు

విజయనగరం క్రైమ్: జాతీయస్థాయి వెటరన్ చాంపియన్‌షిప్‌లో రూరల్ పోలీసుస్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్న వి.కృష్ణంనాయుడు సత్తా చాటారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో కృష్ణంనాయుడును ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. అక్టోబర్ 23 నుంచి 27 వరకు మహారాష్ట్ర నాసిక్‌లోని లెఫ్టినెంట్ మీనాథాయ్ థాకరే స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి వెటరన్ స్పోర్ట్స్ , గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వి.కృష్ణంనాయుడు నాలుగు బంగారు పతకాలు, ఒక సిల్వర్ మెడల్ సాధించారని ఎస్పీ తెలిపారు. రిటైర్‌మెంట్ వయసులో క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. హెచ్‌సీని అభినందించిన వారిలో ఏఆర్ ఏఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ ఏవీ లీలారావు, ఎస్సై వి.అశోక్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులున్నారు.

రైతులకు సహకరించాలి

- ఎంపీపీ మామిడి



మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా సహకరించాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. అలాగే గన్నీ బ్యాగులను విరివిగా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రధానంగా దళారులను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుపతిరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలంటూ వినతి..



వినతిపత్రం చూపిస్తున్న అభ్యర్థులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో 2023 నవంబర్ నెలలో వివిధ కేడర్లకు సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పోస్టులను భర్తీ చేయాలని అభ్యర్థులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అప్పటి నోటిఫికేషన్‌లో కొన్ని కేడర్లకు సంబంధించి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేశారని తెలిపారు. ఆ తర్వాత ఎలక్షన్ కోడ్ వల్ల కొన్ని పోస్టులు భర్తీ చేయలేదని తెలిపారు. కోడ్ ముగిసి ఆరు నెలలవుతున్నా ఇంతవరకు పోస్టులు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని కేడర్ పోస్టులకు పెట్టిన ఫైనల్ మెరిట్ జాబితాలో మెరిట్ సాధించామని, పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల తీవ్ర ఆందోళనకు గురివుతున్నామని చెప్పారు. తక్షణమే పోస్టులు భర్తీ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రహీమ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో అనధికారంగా నిర్వహిస్తున్న రెండు బెల్టు షాపులలో 33 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



విజయనగరం రూరల్: రామనారాయణంలో పూజల్లో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు

కార్తీకమాసం చివరి రోజైన సోమవారం పోలిపాడ్యమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి బారులుతీరారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి, ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేశారు. చిన్నా, పెద్దా అంతా సందడిగా గడిపారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం శివాలయంలో భక్తుల సందడి



విజయనగరం రూరల్: కేఎల్‌పురంలో గంగమ్మ తల్లికి దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



విజయనగరం రూరల్: జొన్నవలసలో పోలితల్లికి నమస్కరిస్తున్న మహిళ



విజయనగరం టౌన్: దాసన్నపేట కాపువీధి శివాలయంలో దీపారాధన



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్‌లో శివుడికి పూజలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు